నాదిర్షా టు కారన్ వాలీస్..

భారత్‌లో ఆంగ్లేయుల పాలనకు ప్లాసీ యుద్ధం నాంది పలికితే... బక్సర్ యుద్ధం పట్టుబిగించింది! బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో దివానీ అధికారాన్ని పొంది... క్రమేణా రాజ్యాధికారాన్ని సాధించారు. భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపనకు పునాది వేసి, రెండు సార్లు గవర్నర్‌గా పనిచేసిన రాబర్ట్ క్లైవ్‌కు 'ఆంగ్ల రాజ్యస్థాపనాధికారి' అనే పేరు వచ్చింది!!

పద్దెనిమిదవ శతాబ్దం భారతదేశానికి గడ్డుకాలం. ఈ సమయంలోనే భారత్‌లో తమ భవిష్యత్తును పరీక్షించు కోవటానికి బ్రిటన్, ఫ్రాన్స్ సిద్ధమయ్యాయి. 1739లో ఇరాన్‌కు చెందిన నాదిర్షా భారత్‌పై దండ యాత్ర చేశాడు. దీన్ని అప్పటి మొగల్‌నవాబు మహమ్మద్ షా సమర్థ వంతంగా ఎదుర్కో లేక పోయాడు. భయపడిన మహమ్మద్‌షా హైద రాబాద్ పాలకుడు నిజాం ఉల్ ముల్క్ సహాయం కోరాడు. నిజాం ఢిల్లీ వెళ్లి నాదిర్షాకు నచ్చచెప్పాడు. నాదిర్షా వెళ్తూ, వెళ్తూ మన దేశం నుంచి ఎంతో విలువైన నెమలి సింహాసనాన్ని, కోహినూర్ వజ్రాన్ని తీసుకువెళ్లాడు. నాదిర్షా దండయాత్ర విజయవంతం కావడం మొగలు ల కేంద్రప్రభుత్వాన్ని బలహీనం చేసింది.భారతపశ్చిమ ప్రాంతంలో.. మరాఠాలు విజృంభించి, గెరిల్లా యుద్ధ పద్ధతులను అవలంభించడం తో ఆ ప్రాంతం వైపు విదేశీయులు చొచ్చుకు రావటానికి అవకాశం లభించలేదు. బెంగాల్ నవాబు అలీవర్దీఖాన్ ఆంగ్లేయులను బాగా కట్టడి చేశాడు. ఇక దక్షిణాన... నిజాం బలమైన శక్తిగా ఎదిగాడు.

ప్లాసీ యుద్ధం:

మొగల్ రాజ్యం విచ్ఛిన్నం కావడం, ఆంగ్లేయులకు భారత్‌లో అవకా శాన్ని కల్పించింది. మొగల్ రాజ్యంలో బలమైన సంస్థానాలు లేదా సుబాలలో బెంగాల్, బీహార్, అయోధ్య, హైదరాబాద్ ముఖ్యమైనవి. వీటిలో బెంగాల్‌పై ఆధిపత్యం సాధించడం ఆంగ్లేయులకు అత్యవస రం. ఇందుకోసం అవసర మైతే యుద్ధాలు చేయటానికైనా వారు సిద్ధ పడ్డారు. భారత్‌లో బ్రిటిష్ రాజకీయాధిపత్యానికి 1757లో జరిగిన ప్లాసీ యుద్ధం నాంది పలికింది. ఆ యుద్ధంలో ఈస్టిండియా కంపెనీ సైన్యం బెంగాల్ నవాబు సిరాజుద్దౌలాను ఓడించింది. 1757 జూన్ 23న ముర్షిదాబాద్‌కు 20 మైళ్ల దూరంలోగల ప్లాసీ రణక్షేత్రంలో ఉభయ సైన్యాలు ఢీకొన్నాయి. ఈ యుద్ధంలో మీర్‌జాఫర్, రాయ్ దుర్లభ్‌లు సిరాజుద్దౌలాకు వెన్నుపోటు పొడిచారు.

నవాబు తరపున పోరాడిన విశ్వాసపాత్రుల్లో మీర్‌మదన్, మోహ న్‌లాల్ వంటి వారు ఉన్నారు. సిరాజుద్దౌలా పారిపోతూ మీర్ జాఫర్



కుమారుడి చేతిలో హత్యకు గురయ్యాడు. ప్లాసీ యుద్ధం ముగియటం తో ''భారతదేశానికి అంతమెరుగని విషాదకాళరాత్రి దాపురించింది'' అని బెంగాల్ కవి నవీన చంద్రసేన్ పేర్కొన్నారు. ఆంగ్లేయులు మీర్ జాఫర్‌ని నవాబుగా ప్రకటించి, కానుకల కోసం ఎగబడ్డారు. బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో స్వేచ్ఛగా వర్తక వ్యాపారం చేసుకోవటానికి నవాబు వారికి అవకాశం ఇచ్చాడు. అయితే, మీర్‌జాఫర్ రాను, రాను ఆంగ్లేయుల గొంతెమ్మ కోర్కెలను తీర్చలేకపోయాడు. ఆంగ్లేయులు తనకు ప్లాసీ యుద్ధంలో సహకరించినందుకు బర్దాన్, మిడ్నాపూర్, చిట్టగాంగ్ జిల్లాల మీద కంపెనీకి జమీం దారీ హక్కు కల్పించాడు. కంపెనీ ఉన్నతాధికారులకి 29 లక్షల రూపాయల కానుకలను సమర్పించుకున్నాడు.

బక్సర్ యుద్ధం:

ఆంగ్లేయుల ఒత్తిడి పెరగడంతో మీర్‌జాఫర్ పదవి వదిలేయగా... మీర్‌ఖాసీంను సింహాసనంపై కూర్చోపెట్టారు. అయితే, 1763 నాటికి మీర్‌ఖాసీం కూడా బ్రిటిష్ వారి విశ్వాసాన్ని పొందలేకపోయాడు. ఫలితంగా అతను కూడా పదవిని కోల్పోయాడు. తిరిగి ఆ పదవి మీర్ జాఫర్‌నే వరించింది. పదవి కోల్పోయిన మీర్‌ఖాసీం, అయోధ్య నవా బు షూజ ఉద్దౌలాను కలిశాడు. మొగల్ చక్రవర్తి రెండో షా ఆలంను కూడా కలిసి, ఆంగ్లేయులపై యుద్ధానికి తెర తీశాడు. అదే బక్సర్ యుద్ధం. 1764లో జరిగిన బక్సర్ యుద్ధం ఆంగ్లేయుల బలానికి, భారతీయ రాజుల బలహీనతలకు సాక్షిగా నిలిచింది. మన బలహీనత ఎంతగా బయటపడిందంటే... మనం ఆంగ్లేయులతో పోటీ పడి ఒక్క రోజులోనే ఓడిపోయాం. దాంతో భారత సస్యశ్యామల సీమలైన బీహార్, బెంగాల్, ఒరిస్సాలపై బ్రిటిష్ వారికి దివానీ అధికారం లభించింది.

దివానీ అధికారం:

బలిచక్రవర్తిని మూడడుగుల నేలను అడిగిన వామనుడు చందాన... ఆంగ్లేయులు బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో దివానీ అధికారాన్ని మొగల్ నవాబు రెండో షా ఆలం నుంచి పొందారు. ఆ ప్రాంతాల్లో శిస్తువసూలు చేసుకోవడం ఆరంభించారు. భారతదేశంలో కేవలం

వర్తకం కోసం వచ్చి క్రమేణా భూభాగాలను ఆక్రమించుకోవడం మొదలుపెట్టారు. దీనికంతటికీ కారణం భారతీయ రాజుల బలహీనత. అలా కాకుంటే.. భారతీయ సంస్కృతి మరింత సుసంపన్నం అయి ఉండేదేమో? ప్లాసీ, బక్సర్ యుద్ధాల అనంతరం సారవంతమైన బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో ఆంగ్లేయులు రాజకీయ, ఆర్థిక అధికారాన్ని సాధించారు.

అనంతరం మరింతగా చొచ్చుకు రావడానికి ప్రయత్నించారు. మొగల్ సామ్రాజ్యం బలహీనం కావటం.. సంస్థానాల్లో ఐకమత్యం లేకపోవడం.. దక్కన్‌లో నిజాం నవాబు వారసులు అధికారం కోసం కోట్లాడుకోవటం.. ఆంగ్లేయులకు కలసి వచ్చింది.

రాబర్ట్ క్లైవ్:

బ్రిటిషర్లు భారత్‌లోకి వేగంగా దూసుకుపోయే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ వేగాన్ని మరింతగా పెంచింది రాబర్ట్ క్లైవ్. అందుకే క్లైవ్‌కు భారత్‌లో 'ఆంగ్ల రాజ్యస్థాపనాధికారి' అనే పేరు వచ్చింది. అతను చాలా తెలివిగా బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టాడు. నిజామత్ అనే పరిపాలనాధికారం భారతీయుల వద్ద, దివానీ అనే పన్ను వసూలు అధికారం ఆంగ్లేయుల వద్ద ఉంది. రాబర్ట్ క్లైవ్ రెండుసార్లు బెంగాల్ గవర్నర్‌గా వ్యవహరించాడు. భారత్‌లో ఉన్నపుడు అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై బ్రిటన్ ప్రైవీ కౌన్సిల్ విచారించింది. ఈ అవమానం భరించలేక క్లైవ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భారత్‌లో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేసిన క్లైవ్ జీవితం ఆత్మహత్యతో ముగియటం విషాదం!!

రెగ్యులేటింగ్ చట్టం:

1773 రెగ్యులేటింగ్ చట్టం ప్రకారం... బెంగాల్ గవర్నర్ జనరల్‌గా వారన్‌హేస్టింగ్స్ పదవిలోకి వచ్చారు. అతను అధికారంలోకి రాగానే ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేశాడు. శిస్తు వసూలులో వేలంపాట పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఎవరు ఎక్కువ వేలానికి పాడుకుంటే... వారే శిస్తు వసూలు అధికారులవుతారు. ఈ శిస్తును వారి వద్ద నుంచి వసూలు చేసుకునేందుకు కలెక్టర్‌ల వ్యవస్థకు వారన్ హేస్టింగ్స్ తెర తీశాడు.

పిట్స్ ఇండియా చట్టం:

హేస్టింగ్స్ కాలంలోనే '1784 పిట్స్ ఇండియా చట్టం' ప్రకారం కలకత్తాలో సుప్రీంకోర్టు ఏర్పడింది. దీని మొదటి ప్రధాన న్యాయమూర్తి సర్ ఎలిజా ఇంపే. సుప్రీంకోర్టు ఏర్పడిన తర్వాత ఉరిశిక్షకు గురైన మొదటి భారతీయుడు నందకుమార్. ఆంగ్లేయులు తమ రచనల్లో నందకుమార్‌ని నన్‌కుమార్ అని పేర్కొన్నారు. హేస్టింగ్స్ హయాంలోనే మొదటి మైసూర్ యుద్ధం, రెండో మైసూర్ యుద్ధం, మొదటి మహారాష్ట్ర యుద్ధం జరిగాయి. కంపెనీ ప్రభుత్వానికి ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వ ఖర్చులు సులువుగా నడవటానికి నందకుమార్, రోహిల్లా యుద్ధం, చైత్‌సింగ్ ఉదంతం, కాశీరాజు కేసు, అయోధ్య బేగం వ్యవహారాలలో జోక్యం చేసుకున్నాడు. ఏ గవర్నర్ జనరల్ వచ్చినా.. తాను లాభపడటంతో పాటు, కంపెనీకి లాభం చేకూర్చడమే వారి ప్రధాన ఉద్దేశంగా కొనసాగింది!

కారన్ వాలీస్:

కారన్‌వాలీస్ కాలంలో భారత్‌లో శాశ్వత శిస్తు నిర్ణయ విధానం ప్రవేశపెట్టారు. దీనినే పర్మనెంట్ సెటిల్‌మెంట్ అంటారు. ఇంతకుముందు వేలంపాట పద్ధతిలో శిస్తు వసూలు చేసిన పెత్తందార్లు... ఈసారి ఆ భూములకు జమీందారులు అయ్యారు. భూమిపై హక్కులు పొందారు. తొలుత బెంగాల్- బీహార్-ఒరిస్సాలలో 1793లో శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టారు. దీని ప్రకారం భూములపై హక్కులు పొందిన జమీందార్లు ఆంగ్లేయులకు రక్షణ కవచంగా నిలిచారు. ఇలా జమీందార్లు ఆంగ్లేయులకు సహకారం అందించటం వల్లనే 1857 సిపాయిల తిరుగుబాటు విఫలం అయింది.భారత్‌లో సివిల్ సర్వీసుల వ్యవస్థను ప్రవేశపెట్టింది కూడా కారన్ వాలీస్‌సే. వాటిని ఎ,బి,సి తరగతులుగా విభజించారు. సివిల్ సర్వీసును సాధించిన మొదటి భారతీయుడు సత్యేం ద్రనాథ్ ఠాగూర్. ఐ.పి.ఎస్‌ను సాధించింది సురేంద్రనాథ్ బెనర్జీ. కారన్‌వాలీస్ జమీందారీ విధానం ఆంగ్లేయుల ఖజానా నిండడానికి దోహదం చేసింది. జమీందారులు మాత్రం రైతులనుపీక్కుతిన్నారు. జమీందారు ఆంగ్లేయులకు చెల్లించిన పన్నును పేష్‌కుష్ అన్నారు. ఇక చేనేత వస్త్రకారులు చెల్లించే పన్నును మోతుర్ప అని పిలిచారు.